


# ఎంత చెట్టుకు అంత గాలి

పైడిపాల

"అనగనగా ఒక ఊరు ..."

"ఛస్! ఇదేం కథరా పేదరాశి పెద్దమ్మ కథలా!" సైడ్ బర్న్స్ పెంచిన కుర్రాడు కోప్పడ్డాడు.

"విను, గురూ. బోరు కొడితే చెప్పు, మానేస్తాను. పంచాయితీ పరిపాలన ప్రారంభమైనప్పటినుంచీ శ్రీమాన్ పానకాలరావుగారే ఆ ఊరికి ప్రెసిడెంటు పదవి నిర్వహిస్తూ ఏకచ్ఛత్రాధిపత్యంగా పరిపాలిస్తున్నారు..."

"ఆయన అజాతశత్రువన్న మాట!"

"అనే చెప్పుకోవాలి మరి. చైనా యుద్ధం వచ్చినప్పుడు స్థానిక ప్రజల అమేయమైన దేశభక్తికి ఫలితంగా వసూలైన రక్షణ నిధిలో తాసిల్దారు గారి భక్షణ నిధికి కొంత సమర్పించి, ఉడతాభక్తిగా తనుకూడా తమ అనుంగు ప్రియురాలు శోభాదేవి కొక భవనం కట్టించుకుంటేమాత్రం — అరవై తొమ్మిదిలో వచ్చిన తుఫాను ఫలితంగా పేదల ఇళ్లకు మంజూరయిన సొమ్ముతో పెద్దమ్మాయి నో ఇంటిదాన్ని చేసిన మునసబుని గాని, అదే సందర్భంలో నాలుగెకరాల కొండ్ర కొనుక్కున్న కరణాన్ని గాని పల్లెత్తు మాట అన్నాడా? లివ్ అండ్ లెట్ లివ్ పాలిసీ అవలంబించిన ఆయన నిజంగా మహాత్ముడు. అందుకే వచ్చే ఎలెక్షన్‌లో కూడా ఆయనే ప్రభువుగా ఉండాలని ప్రజలంతా పట్టుపడుతున్నారట. కన్నబిడ్డల్లాంటి వారి కోరికను కాదనలేక ఆయన అడ్వాన్సుగా అభయహస్త మిచ్చారు..."

"ఎంత చెప్పినా ఆయన గురించేనా— కావ్యాల్లో నాయకుణ్ణి వర్ణించినట్టు?"

"చెప్పాలంటే చాలా ఉంది. కాని, స్థాలీపులాక న్యాయంగా కథలో పాత్ర పోషణ దెబ్బతినకుండా మాత్రమే చెపుతున్నాను. నమ్మిన వాళ్లకి ఆయన ప్రాణమైనా ఇచ్చేస్తాడట. అర్ధాంతరపు ఎన్నికల్లో ఎదుటి వర్గం వా రిచ్చిన ఏభై వేలు తీసుకొని ఆ విషయం తమ వర్గం చౌదరిగారితో చెప్పి మరో ఏభై గుంజితే మాత్రం? ఓటిచ్చి గెలిపించారు. తుఫానులో పడిపోయిన చెట్లు ట్రాఫిక్‌ని బంద్ చేస్తాయేమోనని ప్రజల సౌకర్యం కోసం వేలం పాడి తనని నమ్మిన శోభాదేవి తమ్ముణ్ణి 'గాంధీ కలప డిపో'కి ప్రొప్రయిటరుగా చెయ్యడమే కాదు, ప్రతి పనికి అడ్డొస్తున్న అనంతరెడ్డిని సారాయి వ్యాపారంలో భాగస్వామిగా చేర్చుకుని లక్షల లాభం పంచింది కూడా ఆయనే..."

"ఆల్ ఈజ్ రైట్ విత్ ది వరల్డ్. ఇంక కథెందుకు, స్వామీ?"

"ఆల్ ఆర్ వైజ్. బట్ ది అదర్స్ ఆర్ అదర్‌వైజ్. అదే పిటీ. పానకాల రావుగారి మూడంతస్తుల 'గాంధీభవన్' ఉన్న ఆ ఊళ్లో తుఫానుకి పడిపోయిన గుడిసెలు కూడా 'ఎయిర్ కండిషన్డ్' గానే ఉండిపోయాయి. కొన్ని తలలు ప్రభువుల హృదయాలనే దోచుకుంటున్న ఆ ఊళ్లో, మరి కొన్ని తలలు దాచుకోవడానికి చోటు లేదు. పానకాలరావుగారి పెద్దమ్మాయి అయిదు పాసవడంతో హైస్కూలే శాంక్షనయిన ఆ ఊళ్లో ఆయన క్రోధాగ్నికి ఆహుతి అయి ఏజెన్సీ ప్రాంతాలకి ట్రాన్స్‌ఫర్ చెయ్యబడ్డ స్కూలు మాస్టార్లున్నారు. తన చలవతో ప్రెసిడెంటు గారి దయ సంపాదించి ఆయన చలవతో ఆ ఊళ్లో మహారాణిలా వెలిగిపోతున్న పంతులమ్మ శోభాదేవితో పాటు నోటికి, నోటుకి లొంగని కొత్త పంతులమ్మ పంకజం ఉంది ... ఇలా ఉండగా ఒక సుప్రభాతం బాంగ్లాదేశ్ విముక్తి — పాకిస్తాన్ యుద్ధ సందర్భంలో కొత్త మేడకి వేసిన పునాదుల మీద ఠీవిగా చుట్ట కాలుస్తూ నిలబడిన పానకాలరావుగారికి ఓ ఆశ్చర్యకరమైన విషయం తెలిసింది — డామిట్! కథ అడ్డం తిరిగింది ..."

• • •

"టైమెంతయిందిరా?" బద్ధకంగా ఆవులించాడు ప్రసాదం, డబ్బులు నొల్లుకుంటూ.

"మూడు." వాచీ కేసి చూస్తూనే చిల్లర డబ్బులకోసం జేబులు వెతుకుతున్నాడు కిష్టయ్య.

"నీకేం బుర్రగాని తిరగడం లేదు కదా? మనం ఆరింటికి మొదలెడితే మూడవడ మేమిటోయ్? సరిగ్గా చూడు." సత్తెం కసిరాడు.

"అది కాదు, చిట్టి తండ్రీ, తెల్లవారుఝాము మూడయింది." ప్రసాదం టెరిలిన్ జేబు నోట్లతో నిండి ఎత్తుగా ఉంది.

"అయ్యో బాబోయ్! ఎనిమిదింటికే పరీక్ష. పరీక్షకేమిటయిందంటే మా

మీద రక్తంతో తడిసిన మడిచిన చీటీ. ప్రసాదం విప్పి పైకి చదివాడు.

"ఇది హత్యకాదు, ఆత్మహత్య! పానకాల రావు పతుత్వానికి ఆహుతైన నేను పతితనే! కాని, మీలో ఏ ఒక్కరికైనా కొంచెం వర్ధ్యముంటే ఈ పుణ్యభూమిలో మరో ఆడది ఇంత హీనాతిహీనంగా చనిపోయే పరిస్థితిని రానీయకుండా జాగ్రత్తపడండి. అప్పుడే నా ఆత్మకి శాంతి.

—పంకజం."

యువతరం మెదళ్ళలో హోరు. గింగుర్లెత్తించే తుఫాను. భూమ్యాకాశాలు కలిపేసే ఆవేశం. పడగ విప్పిన మాన వత్వం కొడుతున్న బుసలు.

ప్రసాదం గట్టిగా అరిచాడు. "ఈ అన్యాయాన్నిక సాగనివ్వం!..."

•

శవం చుట్టూ మూగిన జనం ఘోరం జరిగిపోయిం దన్నారు. ఘోరాతిఘోరం జరిగిపోయిం దన్నారు. చనిపోయినామె పరమ పతివ్రత అన్నారు. ఆమె అగ్నిశిఖ అన్నీ, వేదరంటుమనీ చెప్పుకున్నారు. కారణాన్ని కొప్పెట్టి రకరకాలుగా కథలు ప్రచారంలోకి వచ్చాయి.

మునసబుగా రొచ్చి కప్పిక్కొట్టుకొని ఆమె వ్రాసిన చీటీ జేబులోకి తోసేశారు. పోలీసు లొచ్చారు — శవాన్ని తీసుకెళ్ల డానికి!

ఆ ఉదయం ఇన్నాళ్ళుగా సాగుతున్న దౌర్జన్యాల నరికట్టడంకోసం ప్రసాదం నాయకత్వంలో యువజన సంఘం ఏర్పడింది. పంకజం వ్రాసిన ఉత్తరం ఆధారంగా మునసబుని ప్రెసిడెంటు మీద రిపోర్టిమ్మని కోరారు. ఈ వార్త మునసబు పానకాలరావుగారి చెవిని వేసే సరికి ఆశ్చర్యపోయా రాయన! అవును, నైరాశ్యంగా తిరిగేస్తున్న కుర్రవెధవ ల్లోంచి తిరుగుబాటా? ఆ ఊరు చరిత్రలో లేనిది! (హారి! — కలికాల ప్రభావం!) పునాదులు దిగి నీతిని వద్దారు పానకాలరావుగారు.

• • •

ఆ రోజు యువజన సంఘం ప్రారంభోత్సవం. యువకులంతా ఉత్సాహంగా ఉన్నారు. ఈ రోజు అటో ఇటో తేల్చి పారేస్తామంటున్నారు. ఊరునిండా జనం కిటకిటలాడిపోతున్నారు. ఒకటే గుసగుసలు జనంలో — మంత్రిగారు వస్తారు. మంత్రిగారు వస్తారు.

ఓ పల్లెటూళ్లో జరిగే యువజన సంఘం ప్రారంభోత్సవం మంత్రిగారి అధ్వర్యంలో జరగడం విశేషమే మరి! అందుకే ఎవరి నోట విన్నా మంత్రిగారి మంచితనం గురించే. ఆయన నిజాయితీ గురించే!



భక్తి పారవశ్యం
చిత్రం—కె. రంగారావు (దేవరకొండ)

పంకజం హత్యతో మేల్కొన్న యువ తరం పానకాలరావుగారి గుండెల మీద కుంపటయింది. ఇన్నాళ్ళుగా గత్యంతరం లేక అణగి మణగి ఉన్న వాళ్లంతా యువ జన సంఘానికి అండగా నిలబడ్డారు. ఆ చుట్టుపక్కల సంఘం గురించి విన్నవకున్నవీ, చదువుకొని పాడయిన వాళ్ళనీ రకరకాల కథలు ప్రచారంలోకి వచ్చాయి. ఊరు బాగుపడ్డానికే కుర్రాళ్ళకి బుద్ధి పుట్టిందని మెజారిటీ అభిప్రాయం.

తిరగబడిన కుర్రాళ్ళని రాయబారానికి పిలిచిన పానకాలరావుగారి పాచిక పారలేదు. డబ్బు, దర్పం వాళ్లను లొంగదీయలేక పోయాయి. పంకజం హత్య విషయమై ప్రెసిడెంటు మీద కేసు నడిపించాడు ప్రసాదం.

కేసు రెండు నెలలు జరిగింది. చివరికి జిల్లా కోర్టులో కేసు కొట్టేశామన్నారు. పానకాలరావు మీసం మెలేశారు. నిలబడ్డ నేల కిందికి దిగిపోయినట్టయింది యువతరానికి.

ఇది అన్యాయ మన్నారు. అమానుష మన్నారు. పత్రికల కెక్కించారు. కని పించిన అధికారినల్లా ప్రాధేయపడ్డారు. న్యాయాన్ని నెగ్గించమన్నారు.

అందరూ ఒకటే మాట! 'యువ తరంలో వచ్చిన ఉత్తేజం ఊరికే పోదు! పోలీసు మొదలు కలెక్టరు వరకు తమ సహాయం తప్పకుండా ఉంటుందని హామీ ఇచ్చారు. హైకోర్టుకి అప్పీలుచేస్తే నెగ్గవచ్చన్నారు. దీనికి స్థానిక మంత్రిగారి సహాయ ముంటే మంచిదని మరొకరు సలహా ఇచ్చారు. న్యాయానికి సిఫారసు లెందుకన్నాడు ప్రసాదం. కాని, పరిస్థితిని అర్థం చేసుకుని మంత్రిగారిని స్వయంగా కలుసుకొని సహాయం అర్థించాడు. ఆయన అభినందించారు. తప్పనిసరిగా తన సహకారం ఉంటుందన్నారు. ఈలోగా అన్ని విషయాలు స్వయంగా చూడ్డానికి యువజన సంఘం ప్రారంభోత్సవం సందర్భంలో ఆయన రావాలని కోరారు యువకులు. వాళ్ళ కోరికను మంత్రి గారు కాదనలేదు.

మంత్రిగారు కలగజేసుకున్నా రనేసరికి పానకాలరావుగారికి ప్రాణం మీది కొచ్చింది. తన ప్రయత్నాలు తను సాగిస్తున్నారు. మంత్రిగారి సామర్థ్యం ఆయనకు బాగా తెలుసు.

వచ్చేవాళ్ళు వస్తున్నారు. పోలీసులు హడావిడిగా తిరుగుతున్నారు. స్టేజిమీద ఏర్పాట్లన్నీ జరిగిపోయాయి. గేటుదగ్గర జాతీయ పతాకం రెపరెపలాడుతూంది. ప్రతివాళ్ళూ వాచీలు చూసుకుంటున్నారు.

మూడున్నర — మంత్రిగారు రావడం లేదనే వార్త గాలిలా, మాయలా వ్యాపించింది.

నాలుగు — నిజంగానే టెలిగ్రామ్ వచ్చింది. ప్రసాదం బిత్తరపోయాడు. కుర్రాళ్ల మొహాలన్నీ వాడిపోయాయి.

మరో గంటలో ఎవరి నోట విన్నా ఒకటే మాట. వస్తానన్న మంత్రిగారు పండ్పలో లక్షల మీద కాజేస్తే విచారణ జరుగుతుందట. ఆ కేసు మాఫీ చేసుకోవడం కోసం చేస్తున్న ప్రయత్నాల్లో ఉన్నారట. అందుకని రాలేకపోయారట!

యువతరం మెదడులో హోరు. గింగుర్లెత్తించే తుఫాను. భూమ్యాకాశాల్ని కలిపేసే ఆవేశం. పడగెత్తిన మాన వత్వం కొడుతున్న బుసలు.

ప్రసాదం జనంలోకి దూకి పెద్దగా అరిచాడు ... 'ఈ అన్యాయాన్ని సాగనివ్వం!'

• • •

కథ చెపుతున్న వ్యక్తి చుట్టూ జనం. నడిరోడ్డు మీద జనం. ట్రాఫిక్ ఆగిపోయేటంత జనం. వింటున్నారు. మధ్యలో ప్రశ్నలు వేస్తున్నారు జ...జ... జ... జనం!

"ప్రసాదం! ఇక్కడి కెలా వచ్చావురా?" అతణ్ణే వెదుక్కుంటూ వచ్చిన కిష్టయ్య, పట్టేం పట్టుకున్నారు.

"ఇతనా ప్రసాదం? ఏ ఊరు?" సైడ్ బర్న్స్ కుర్రాడు ప్రశ్నించాడు.

"ఇక్కడికి ముప్పై మైళ్ళ దూరంలో ఉన్న పల్లెటూరు. మతి చెడి..." కిష్టయ్య మాటలు పూర్తి కాలేదు.

"మతి చెడిన వాడైతే ఇలాంటి కథలు చెప్పడు. ఏ దేవడో విప్లవకారుడు. తోసేయండిరా వెధవను లోపలికి." ఆర్డరు జారీచేశాడు పది నిమిషాలై వచ్చి నిలుచున్న సబ్ ఇన్‌స్పెక్టర్.

"అయితే ఇంతవరకూ చెప్పింది?"

"మన కథే. జరుగుతున్న కథ. కాని, పుక్కిటి పురాణాలే కాని, ఇలాంటివి చెప్పుకోం మనం. మన దేశం వేదాలు పుట్టిన నేల. భగవద్గీతను చెప్పిన నేల. మనుషుల్లో రక్తం ప్రవహించకపోతేనేం? గంగా గోదావరులతో పునీతమైన భూమి! పీలుస్తున్న గాలి ఏదైతే నేం? అశోకుడు చెట్లు నాటించిన భూమి! గజనీ కో గాంధారి కొడుకు ఉంటేనేం? గాంధీ గారు పుట్టిన దేశం!" పోలీసులు లాక్కెడుతున్న ప్రసాదం అరుపు లిక వినిపించడం మానేశాయి! ★